# చీమలు

"ఎన్ని చీమలు చంపితే అంత పుణ్యం! చంపండి, చంపండి" అంటున్నాడతను. చుట్టూ ఇద్దరు ముగ్గురు పిల్లలు చేరి చీమల్ని చంపుతున్నారు.

అది ఒక పూర్వకాలపు పెద్ద భవంతి అరుగు. దానిమీద చీమలు చేరాయి. వాటిని చంపుతున్నాడు ఆదినారాయణ.

అతనికి చేతికి ఉంగరం ఉంది. ఖరీదైన బట్టలు వేసుకున్నాడు. కానీ చొక్కా గుండీ వూడిపోయింది. జేబునిండా మట్టిఉంది. అది కూడా చినిగిపోయి ఒక్కపక్క వేలాడుతోంది. చింపిరి జుట్టు. మాసినగడ్డం. కాళ్లకు జోడులేదు. వయసు ముప్ఫయ్యయిదూ ముప్ఫయారు ఉండవచ్చు.

"ఎన్ని చీమల్ని చంపితే అంత పుణ్యం. చంపండి. ఏమండోయ్ మిమ్మల్నే. మీరూ నాలుగు చీమల్ని చంపండి. మీకు పుణ్యం వస్తుంది." అని దోవనపోయేవాళ్ళని పిలుస్తున్నాడు.

అతనికి మతి చెడింది. కాస్త కలిగిన కుటుంబంలో పుట్టినవాడే. పదెకరాల మాగాణి పొలం ఉంది. కొబ్బరితోట ఉంది. విశాలమైన పెంకుటిలోగిలి ఉంది. ఒక అన్న, ఒక చెల్లెలూ ఉన్నారు. చెల్లెల్ని రాజమండ్రీ ఇచ్చారు. అన్నగారు ఉన్న వూళ్లోనే వ్యవసాయం చేస్తున్నాడు.

ఆదినారాయణ ఇంటర్ మీడియట్ పాసయ్యాడు. అంతకంటె చదువు అనవసరం అనిపించింది. ఏం? జరుగుబాటులేదు గనుకనా? తినికూచుంటే దినం వెళ్లిపోతుంది అతనికి, బాగా చదువుకున్న పిల్లను చేసుకోవాలని కోరిక. అందమూ చదువూ సంప్రదాయముకల పిల్లకావాలని వెదికారు. చివరికి ఎలాగైతేనేం పక్క వూళ్లోనే దొరికింది. దగ్గర్లోనే తగిన పిల్లని పెట్టుకొని దేశం అంతా వెదికినందుకు నొచ్చుకున్నారు.

ఆ పిల్ల రత్నం
ఆ పిల్ల అపరంజి బొమ్మ
ఆ పిల్ల చదువుల సరస్వతి
ఆ పిల్ల వినయవిధేయతలు కలది
ఆ పిల్ల పనిపాటలు చక్కగా చేస్తుంది
అంతేనా?
ఆ పిల్ల చక్కగా పాడుతుంది కూడాను

ఘనంగా పెళ్ళి జరిగిపోయింది. అందరూ ఆదినారాయణ అదృష్టాన్ని తెగపొగిడారు. మంచి కుటుంబంలో పడినందుకు అందరూ ఆమె అదృష్టాన్ని కూడా మెచ్చుకున్నారు.

ఆ అమ్మాయిపేరు సుందరి. అంతా అలానే పిలుస్తారు. అసలు పేరు చాలా పొడుగు. వీరవెంకట సత్యబాల సూర్యత్రిపురసుందరి!! సుందరీ అంటే ఓయ్ అని ముద్దుగా పలికేది. వంటపనిలోనూ, ఇంటిపనిలోనూ అత్త గారికి సాయం చేసేది. తీరబడి వేళల్లో మామగారికి ఏ భారతమో, రామాయణమో చదివి వినిపించేది. ఇంటికి ఉత్తరాలొస్తే చక్కగా చదివి వినిపించేది. ఉత్తరాలు రాయవలసివస్తే పెద్దలు చెబుతుంటే రాసేది. అవి అక్షరాలుకావు. ముత్యాలు.

ఇరుగు పొరుగుల్లో ఎక్కడేం పేరంటం జరిగినా, సుందరి చక్కగా పాడేది. కొసరి కొసరి పాడించుకునే వారు. పూర్వకాలపు భక్తిపాటలూ పాడేది. సినిమాపాటలూ పాడేది.

ఒక ఆరు నెలలు బాగానే గడిచిపోయాయి.

ఆదినారాయణ తల్లి హటాత్తుగా చచ్చిపోయింది. ఇంటిపని యావత్తూ పెద్ద కోడలిమీద పడింది. సుందరి తోడికోడలుకు సాయం చేసేది. వంటపనంతా పెద్దావిడచేస్తే రోజూ సాయంత్రం కోనేటికెళ్ళి బిందెడు మంచినీళ్లు తేవడం, రెండు పూటలా ఇల్లూవాకిలీ తుడవడం, మామగారికి స్నానానికి నీళ్లు తోడటం, ఆయన బట్టలు ఉతకడం– వగైరా పనులన్నీ సుందరి చేసేది.

ఒక రోజు మునిమాపు వేళ కోనేటి నుంచి నీళ్లబిందె ఎత్తుకుని వస్తోంది.

ఎదురుగా ఒక నవమన్మధాకారుడు కనిపించాడు. చలించి పోయింది. కొనదేలినముక్కు, చీలినగడ్డం, గ్లాస్కో చొక్కాలోంచి విశాలమైన ఛాతీ– ఆఛాతీపై దట్టంగా వెంట్రుకలు, పులిగోరుపతకం మెరిసిపోతోంది. తెల్లని మల్లు పైజామా వేసుకున్నాడు. కాళ్లకు ముద్దులొలికే చెప్పులు వేసుకున్నాడు. ఒక చేతి వేళ్లకు రెండుంగరాలున్నాయి. మరో చేతికి బంగారపు గొలుసువాచీ ఉంది.

వొంకీలజుత్తులో ఒకరింగు అలవోకగా నుదుటిమీద పడుతోంది. అప్రయత్నంగా అతను చిరునవ్వు నవ్వాడు, అతని కళ్లతో అపూర్వమైన వెలుగు మెరిసింది.

అప్రయత్నంగా ఆమెకు చిరునవ్వు వచ్చింది. నరాలు జివ్వున లాగేసిట్టయిపోయింది. ఇద్దరికీను.

అంతా క్షణంలో సగంలో జరిగిపోయింది.

వెనక్కి తిరిగి చూద్దాం అని మనసుమారాం చేసింది, కోరికకు కళ్లాలు బిగించి ఇల్లు చేరింది. మనసు మనసులో లేదు.

మర్నాటి సాయంత్రం గుబగుబలాడే గుండెతో బిందె చంకన వేసుకుని బడలుదేరింది. వీలయినంత మంచి చీర వీలయినంత సోగ్గా కట్టుకుంది. అందంగా జడవేసుకుని రిబ్బనుతో కుచ్చులు వేసుకుంది. పెరట్లో పూసిన మందారాలు తలలో తురుముకుంది.

దిక్కులు చూసుకుంటూ పరధ్యానంగా నడుస్తోంది. అతను కనబడతాడేమోననుకుని. కనపడలేదు. కోనేటి దగ్గర కొంచెంఎక్కువ సేపు గడిపింది. బరువెక్కిన బిందెతో బరువెక్కిన గుండెతో కోనేటి నుంచి బయలుదేరింది. కూడా పక్కవీధి పెద్దరాజు గారి కోడలు ఉంది.

దోవంతా కళ్లు చేసుకుని నడుస్తోంది. అతని జాడలేదు. ఇక మలుపు తిరిగితే ఇల్లు వస్తుందనగా అతను కనిపించాడు.

హటాత్తుగా కనిపించాడు.

గుండెలు హోరు హోరున కొట్టుకున్నాయి.

సంతోషమా? భయమా?

సంతోషమూ భయమూ ఒక్క లాగే ఉంటాయా?

మనోహరంగా నవ్వుతున్నాడు. తాంబూలం వేసుకున్నట్టున్నాడు. పెదవులు ఎర్రగా ఉన్నాయి.

దగ్గరికి వచ్చేసరికి గుప్పున సెంటు వాసన కూడా కొట్టింది.

ఒళ్లంతా మత్తెక్కి పోయింది.

పలకరించబోయినట్టు అతని పెదవులు కదిలాయి. పక్కన మరో ఆడపిల్ల ఉందిగనక ఆగిపోయాడు గావును.

కలలోంచి నడిచినట్టు నడిచి ఇల్లు చేరింది.

భర్తకూ అతనికీ పోలికేమిటీ? మనసులో మరో ఆలోచనకు అవకాశం లేదు. మనసంతా అతనే– ఇలా నాలుగైదు రోజులు సాగింది.

అతడా వూళ్లో రెండు వందల ఎకరాల మాగాణి పొలం వున్న నరసింహరాజు గారి ఏకైక పుత్రుడు. పేరు మూర్తి రాజు. రాజమండ్రిలో బీయే చదివి వచ్చాడట. ఉద్యోగం చెయ్యవలసినంత అగత్యం అతనికేముందీ? తండ్రి ఆ వూళ్లో మకుటంలేని మహారాజు. విలాసం కోసం చదివాడు. అక్షరం ముక్క నేర్చిఉంటే మంచిదనీ తండ్రి చదువు చెప్పించాడు. యువరాజులా గడుపుతున్నాడు. మరొక నాలుగైదులోజుల్లో మాటలు కలిశాయి. ... కలుసుకుంటున్నారు.... చాటుగా....

సుందరి వూహాలోకంలో విహరిస్తోంది. ఆదినారాయణ భార్య ప్రవర్తనలోని మార్పు కనిపెట్టేడు. పెద్దకోడలూ కనిపెట్టక పోలేదు గాని వచ్చే వయసు అని సరిపెట్టుకుంది. ఎవ్వరూ కారణం వూహించలేకలేక పోయారు.

మర్నాటి సాయంత్రం–

అన్నదమ్ములిద్దరూ పొలాన్నొంచి వచ్చారు. బాగా చీకటిపడింది. గడపలోనే ఆదినారాయణ వదినగారు నిలబడిఉంది.

" చాలా సేపయింది, సుందరి నీళ్ల బిందె ఎత్తుకుని వెళ్ళి ఇంకా రాలేదు". అన్నది కంగారు పడుతూ.

ఆదినారాయణ గడపలోంచే దారి తీశాడు, తిన్నగా కోనేటికి. అతని వెనక అన్నగారూ పరుగుతీశారు. ఇద్దరూ వెదకని చోటులేదు. చుట్టు పక్కల వూళ్లన్నీ వెదికించారు.

సుందరి ఇంటికి రాలేదు.

రాజుగారబ్బాయి సుందరిని లేవదీసుకు పోయేడని నాలుగురోజుల తరవాత వూరంతా గుప్పుమంది.

పక్క వూర్నించి వచ్చి సుందరి తల్లీ తండ్రి తల బాదుకున్నారు. ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు?

ఆదినారాయణకు అన్నం తినబుద్ధి పుట్టలేదు. నమ్మలేకపోయాడు. అంత బుద్ధిమంతురాలు అలా చేస్తుందనుకోలేకపోయేడు. ఏదో మందు పెట్టి, మాయజేసి తీసుకుపోయి ఉంటాడనుకున్నాడు.

ఆ తరవాత చాలా గొడవలు జరిగేయి, ఏం లాభం? సుందరి ఆదినారాయణకు దక్కలేదు.

వాళ్లు బొంబాయిలో ఉంటున్నారని తెలిసింది. ఏడాది తిరక్కుండా నరసింహరాజు గారు చచ్చిపోయేరు. ఆ కబురు తెలిసి వచ్చారు వాళ్లు.

ఆమె వూళ్లోకి వచ్చిందని తెలిసి కాపలా కాశాడు వాళ్ల ఇంటి ఇంటి దగ్గర ఆదినారాయణ. చాలా దూరంనుంచి చూశాడు.

సుందరీ సుందరీ అని అరిచాడు.

రా మనింటికి రా అని అరిచాడు.

నన్ను మోసం చెయ్యకు నీకిది న్యాయం కాదని అరిచాడు. ఆ అరుపులకి భూమీ ఆకాశం ప్రతిధ్వనించేయి. చుట్టూ జనం చేరారు. అరిచి అరిచి గొంతు బొంగురు పోయింది. అన్నగారు వచ్చి ఆదినారాయణను ఇంటికి తీసుకువెళ్ళాడు. క్రమంగా అతనికి పిచ్చి పట్టింది.

ఆదినారాయణ ఇంకా చీమల్ని చంపుతూనే ఉన్నాడు. అవి ఏనాడో చచ్చేయి. చచ్చిన చీమల్ని మళ్ళీ మళ్ళీచంపుతున్నాడు.

చావండి – చావండి – అంటున్నాడు.

చుట్టూ ఉన్న పిల్లలు నవ్వుతున్నారు.

అతని అన్నగారు పొలం నుంచి వస్తూ తమ్ముణ్ణి చూసి " పద ఇంటికి పోదాం–" అన్నారు.

"సుందరి వచ్చిందా? అనడిగేడు ఆదినారాయణ

" ఆ వచ్చింది. నీ కోసం ఎదురు చూస్తోంది" అన్నాడు అన్న.

"అయితే వస్తాను సుందరి కోసం వస్తాను పదపద" అని పరుగుపరుగున ఇంట్లోకి వెళ్ళాడు.

సుందరి ఆదినారాయణను విడిచి పదేళ్లయింది. ఇప్పుడామె వయసు ముప్ఫయేళ్ళు దాటాయి. కాని పాతికేళ్ల మనిషిలా ఉంది. పిల్లలు కలగలేదు. సమస్తభోగాలు అనుభవిస్తోంది.

సుందరి వూళ్లోనే ఉంటోంది. కొత్తగా వూళ్లో బస్సుస్టాండు కట్టేరు. అక్కడికి దగ్గరలోనే అధునాతనమైన ఎయిర్ కండిషన్డ్ బిల్డింగ్‌లో ఆమె ఉంటోంది.

సుందరి భర్త రాజు ఎలక్షన్లో పోటీ చేస్తున్నాడట. పార్లమెంటు మెంబరవ్వాలని అతని ఉద్దేశం. టాపులేని జీపు మీద నియోజకవర్గం అంతా ఎన్నికల ప్రచారానికి తిరుగుతున్నారు. స్వయంగా రాజా, సుందరీ తిరుగుతున్నారు.

ఒక రోజు ఆదినారాయణ ఉన్న వీధిలోకి కూడా జీపు వచ్చింది. అన్నిళ్ళతో పాటూ ఆ ఇంటికీ వెళ్ళింది. తప్పక వోటు వేసి గెలిపించమని చెప్పింది.

ఎదురుగా అరుగుమీద కూర్చొని "చంపండి చీమల్ని ఎన్ని చీమల్ని చంపితే అంత పుణ్యం" అంటున్నాడు. ఆదినారాయణ బట్టలు చిరిగి ఉన్నాయి. గడ్డం మాసిఉంది.

ఆ జనం మధ్య సుందరి ఉందని అతనికి తెలీదు. సుందరి అతన్ని ఆ ఇంటి గడప దాటేక ఈ పదేళ్లలోనూ ఇదే చూడటం! ఎక్కడో కలుక్కుమన్నది. జీపుముందుకు సాగిపోయింది.

ఆదినారాయణ చీమల్ని చంపుతూనే ఉన్నాడు. సుందరి మొగుణ్ణి ఎందుకు విడిచి పెట్టిందో ఇప్పటికీ ఎవరికీ తెలియదు.

లోకమందలి మంచి చెడ్డలు లోకులెరుగుదురా?

*రచన : మే / జూన్ 1984*

*ప్రచురణ : ఆంధ్రప్రభ (ఆదివారం అనుబంధం) 15-7-1984*